
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 3

శనివారం 31 మే 2025

పొగచూరుతున్న జీవితాలు

- ప్రాణాలు తీస్తున్న సిగరెట్లు
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

హైస్కూల్, కాలేజీ చదువుల్లో ఎలా ఉంటుందో ఓసారి జస్ట్ ట్రై చేద్దాం అనుకుంటారు. ఉఫ్ ఉఫ్ అంటూ రింగులుగా పొగ వదులుతూ ఉంటే ఆ స్టైలే వేరు అనుకుంటూ ఉత్సాహపడతారు. ఉద్యోగం, కుటుంబం ఇలా సవాలక్ష టెన్షన్లకు సిగరెట్ రిలీఫ్ అని నమ్ముతారు. కానీ ఆ నమ్మకమే మనిషిని కుంగదీస్తుంది. సిగరెట్, బీడీ, గుట్కాలకు బానిసై యుక్త వయసు దాటాక ఆసుపత్రులకు అనారోగ్య సమస్యలతో పరుగులు తీస్తారు. డాక్టర్ దగ్గరకు వెళ్తే గాని అర్థం కాదు, జీవితానికే పొగ పెట్టేశామని. స్మోకింగ్ సరదాగానే మొదలవుతుంది కానీ ఆ తర్వాత సర్పంలా చుట్టేసుకుంటుంది. నల్లని తారు ఊపిరితిత్తుల నిండా పేరుకుపోతుంది. యూత్‌ని తెగ ఆకర్షించే సిగరెట్ ప్రమాదకర అలవాటు. సిగరెట్‌ని దూరంగా ఉంచకపోతే, అదే మనల్ని మన భార్యాబిడ్డలు, తల్లిదండ్రులకు దూరం చేసేస్తుంది. 'ఎప్పుడో ఒకటి కదబ్బా...' అంటే మాత్రం జీవితం పొగచూరక తప్పదు. స్మోకింగ్ మానేయడం పెద్ద కష్టం ఏమీ కాదు. కాకపోతే కాస్త భయం, కుటుంబం పట్ల బాధ్యత ఉంటే చాలు. మరి ప్రయత్నించండి.. నేటి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సాక్షిగా...



4లో

సిద్ధేశ్వరానికి తొమ్మిదేళ్లు

- అలుగు నిర్మిస్తే 50 టీఎంసీల నీటి నిల్వ
- నేడు చలో సిద్ధేశ్వరం పేరిట భారీ బహిరంగ సభ

సిద్ధేశ్వరం రాయలసీమ అస్థిత్వస్వరం. తరతరాల సీమ పోరాటాలకు సిద్ధేశ్వరం గాఢమైన వ్యక్తీకరణ. గత పదేళ్లుగా రాయలసీమ ప్రజా ఆకాంక్షలకు ప్రతీక. పాలకుల నిర్లక్ష్యం, వివక్షలపై ఎలుగెత్తిన ప్రాంతీయ చైతన్యం. సిద్ధేశ్వరం అలుగు నిర్మిస్తే శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలు వినియోగించుకొనే అవకాశం రాయలసీమకు వస్తుంది. దీని కోసం అలుగు ప్రజా శంకుస్థాపన ప్రజా ఉద్యమంగా 2016 మే 31వ తేదిన జరిగింది. దీన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఈ రోజును సీమ పోరాటదినంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం చలో సిద్ధేశ్వరం కార్యక్రమం చేపట్టారు.



సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతం

ఆత్మకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై సిద్ధేశ్వరం సమీపంలో శ్రీశైల జలాశయానికి 860 అడుగుల ఎత్తులో అలుగు నిర్మిస్తే పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందుతుంది. సీమకు శ్రీశైలం వెనకతట్టు జలాలను అందించాలన్న సంకల్పంతోనే 1971-78 కాలంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణాన్ని నీటిపారుదల శాఖాధికారులు ప్రతిపాదించారు. ఇదే క్రమంలో 1976 నుంచి 1988 వరకు శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ నిర్మాణ పనులు జరిగాయి. అప్పటి నుంచి కాల్వ విస్తరణ పనులు పూర్తయి 2000-01లో బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను మూడు జలద్వారాల మీదుగా చేపట్టారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన నీరు శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ ద్వారా బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు వచ్చి చేరుతోంది. తెలుగుగంగ కాల్వ నీటి విడుదల పూర్తి సామర్థ్యం 11,150 క్యూసెక్కులు, ఎస్కేప్ ఛానల్ కాల్వ నీటి విడుదల పూర్తి సామర్థ్యం 11,150 క్యూసెక్కులు కాగా ఎస్సార్బీసీ కాల్వ నీటి విడుదల సామర్థ్యం 4960 క్యూసెక్కుల ప్రవాహం వుండేలా క్రాస్ రెగ్యులేటర్ నిర్మాణాన్ని రూపొందించారు. మూడు జలద్వారాల్లో ఒక్కో ద్వారానికి మూడు గేట్ల చొప్పున మొత్తం 9గేట్లను అమర్చారు. ఇదిలా వుండగా 2006లో పోతిరెడ్డిపాడు ప్రధాన కాల్వను 11వేల క్యూసెక్కుల నుంచి 44వేలకు సామర్థ్యంతో చేపట్టిన విస్తరణ పనులు నేటికీ కొనసాగుతున్నాయి.



శంకుస్థాపనకు తరలివచ్చిన సీమ జనం(ఫైల్)

9 ఏళ్లుగా ప్రజా ఉద్యమం

సిద్ధేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ.. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 2016 మే 31వ జరిగింది. దీనికి రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు కదలి వచ్చారు. అఖిల భారత రైతు సంఘాల నాయకుడు, సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, సీనియర్ ఇంజనీర్ సుబ్బరాయుడు, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ అరుణ్, సిద్ధేశ్వరం ప్రాజెక్ట్ సాధన కమిటీ అధ్యక్షుడు వైఎన్‌రెడ్డితో పాటు 30వేల మంది జనం తరలి వచ్చారు. ఈ ఉద్యమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఎట్టకేలకు కపిలేశ్వరం వద్ద సీమ నేతలు సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 2017లో సీమ సత్యాగ్రహం, 2018 ఛలో సిద్ధేశ్వరం, అలాగే 2019లో ప్రజా పాదయాత్రను చేపట్టారు. అయితే 2020, 2021 సంవత్సరాల్లో కరోనా విపత్తు కారణంగా ఇళ్ల నుంచే స్వచ్ఛంద నిరసనలు చేపట్టారు. ఆతర్వాత 2022లో జలదీక్ష, 2023లో జల జాగరణ దీక్ష, 2024 జలసాధన దీక్షలు చేపట్టారు. ప్రస్తుతం చలో సిద్ధేశ్వరం పేరిట భారీ బహిరంగ సభను శనివారం నిర్వహిస్తున్నారు.

మిగతా 4వ పేజీలో

న్యూస్ బాక్స్

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

నంద్యాల నూనెపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెన్యువల్ చేసిన అక్రిడిటేషన్ కాలపరిమితి మే 31వ తేదీకి ముగుస్తుండటంతో మీడియా అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలపాటు పొడిగిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం మే 31నాటికి అక్రిడిటేషన్ కార్డులు ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1నుంచి ఆగస్టు 31వరకు పొడిగింపు వర్తిస్తుందన్నారు. ఈలోగా కొత్తకార్డులు జారీ ప్రక్రియ ముందుజరిగితే అప్పటివరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందన్నారు.

భ్రమరాంబ దేవికి ఊయల సేవ



స్వామి అమ్మవార్లకు ఊయలసేవ

నంద్యాల కల్చరల్ (శ్రీశైలం), మే 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం, శక్తిపీఠం శ్రీశైలంలో భ్రమరాంబ దేవికి శుక్రవారం ఆలయ అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. లోక కల్యాణార్థం ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పుష్పార్చన, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని పుష్పాలతో అలంకరించిన ఊయలపై కొలువుదీర్చారు. శైవ మంత్రాల నడుమ అమ్మవారి ఊయలసేవ ఆసాంతం అలరించింది.

ముగిసిన స్వర్ణోత్సవాలు

- 1,236 కలశాలతో ఘటాభిషేకం



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు

నంద్యాల కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో శుక్రవారం ఆలయ స్వర్ణోత్సవం వైభవంగా ముగిసింది. ఆలయప్రాంగణంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, ఉప ఆలయాలు, పరివార దేవతలకు 14 శిఖర కలశాలకు పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతి మహాస్వామి స్వయంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం రాజగోపురం శిఖర కళశాలకు స్వామివారు అభిషేకం చేశారు. హోమాలు నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కార్తికేయ శర్మ, భగవత్‌సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారథిక్రిష్ణ, మధు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దుతో బియ్యం అక్రమ రవాణాకు చెక్

- సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు

నందికొట్కూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాల రద్దుతో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ఆస్కారం ఉండదని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు అన్నారు. శుక్రవారం నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్‌తో పాటు సెంట్రల్ వేర్ హౌస్‌లను డైరెక్టర్లు మహేష్ నాయుడు, లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ గోదాములో రేషన్ బియ్యం నిల్వలను పరిశీలించారు. గోదాములో ఉన్న బియ్యం బస్తాలను తూకాలు వేసి చూశారు. దీంతో ఒక బస్తా 43 కేజీలు, మరో బస్తా 44 కేజీలు రావడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలర్లకు ఖచ్చితమైన తూకంతో బియ్యం చేరవేయాలన్నారు. అనంతరం మహేష్ నాయుడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి కేంద్ర బిందువుగా ఉన్న ఎండీయూ వాహనాలను రద్దు చేసి, ఒకటో తేదీ నుంచి డీలర్ల ద్వారానే పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకంలోనూ, రెసిడెన్సియల్ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు జూన్ 1వ తేదీ నుంచి సన్న బియ్యం అందజేస్తామన్నారు.



ఎం.ఎల్.ఎస్ గోదాములో నిల్వ ఉన్న బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న డైరెక్టర్లు

ఆగిన హంద్రీ విస్తరణ పనులు

- అనుకోని వర్షాలతో ఆగిన పురోగతి..!
- జూన్ 10లోగా పూర్తి చేయాలని లక్ష్యం.. పురోగతి 50 శాతంలోపే

5

మూఢ నమ్మకాలు వద్దు

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్

కర్నూలు హాస్పిటల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకం అనేది మనిషి ఎదుగుదలకు అడ్డుగోడ లాంటిదని జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్ అన్నారు. నగరంలోని బిర్లా కాంపౌండ్ వద్ద శుక్రవారం జన విజ్ఞాన వేదిక 3 రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, పర్యావరణం, మహిళా సాధికారిత, మూఢ నమ్మకాల లాంటి అంశాలపై జేవీవీ పని చేస్తోందన్నారు. ప్రభుత్వం సహకారం అందిస్తే అన్ని జిల్లాలో జేవీవీ తరఫున అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. జేవీవీ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు మహ్మద్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు కృష్ణోజి, రమణయ్య, కోటేశ్వరరావు, శ్రీను, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

కర్నూలు జీజీహెచ్ అభివృద్ధిపై మంత్రి భరత్ సమీక్ష

డీసీసీబీ అభివృద్ధికి కృషి

చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

4

మేలో పది రెట్ల వర్షం

37.5 ఎంఎం వర్షపాతానికిగాను 105 ఎంఎం నమోదు

కర్నూలు అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మే నెలలో సాధారణ వర్షపాతానికి మించి నమోదు కాదు. అయితే.. ఐదేళ్ల తర్వాత మొదటి సారిగా ఈ మే నెలలో సాధారణ వర్షపాతం 37.5 ఎంఎం గాను ఏకంగా 105 ఎంఎం వర్షపాతం నమోదైంది. గత నెల ఏప్రిల్‌లో 15.6 ఎంఎం వర్షపా తానికి గాను 44.9 ఎంఎం వర్షం నమోదైంది. దీంతో కర్నూలు జిల్లాలోని పొలాలు పూర్తిగా పదునెక్కాయి. రైతు లు గత సంవత్సరం మాదిరిగానే మే నెలలోనే పంటల సాగుకు సిద్ధమ య్యారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండు సమీపంలో ఉన్న విత్తనాలు, ఎరువుల అంగళ్ల వద్ద రైతులు క్యూ కట్టారు. మంత్రాలయం, ఆస్పరి, ఆలూ రు, సీ.బెళగల్, గోనెగండ్ల, కౌతాళం, పెద్దకడబూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, కల్లూరు, మద్దికెర, పత్తికొండ, తదితర మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఇప్పటి కే రైతులు పత్తి, కందులు, మిరప, ఉల్లి, మొక్కజొన్న తదితర పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు కొనే పనుల్లో ఉన్నారు.

సారాపై ఉక్కుపాదం

- ఫలిస్తున్న అధికారుల ప్రయత్నాలు
- జిల్లాలో 52 సారా రహిత గ్రామాలు
- రాష్ట్రస్థాయిలోనే మొదటిస్థానంలో అమ్మకాలు
- సారా తయారీ, అమ్మకందారులపై కేసులు
- కర్నూలు జిల్లాపై దృష్టిపెట్టిన రాష్ట్రస్థాయి అధికారులు


కర్నూలు అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో గ్రామాలు, తండాల్లో సారా తయారీ, అమ్మకాలు జోరుగా సాగుతుండేవి. రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి రాగానే తెరపైకి నవోదయం2.0 పేరుతో సారా నిర్మూలన కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. సారాపై ఎక్సైజ్ ఉక్కుపాదం మోపింది. కర్నూలు జిల్లాలో సారా లేకుండా చేయడమే లక్ష్యంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు పనిచేస్తున్నారు. కర్నూలు జిల్లాలో సారా ప్రభావిత గ్రామాలు 110 ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 52 గ్రామాల్లో ఒక్క చుక్క సారా లేకుండా చేశారు. ప్రభుత్వం రూ.99కే అందిస్తున్న చీప్ లిక్కర్‌ను సారా స్థానంలో అందిస్తోంది. గత ఏడాది మే నెలలో రూ.68 కోట్ల అమ్మకాలు జరిగితే ఈ ఏడాది మే నెలలో అంతకు మించి రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానంలో అమ్మకాలు జరగడం విశేషం. సారా తయారీ, అమ్మకందారులపై కేసులు నమోదు చేస్తుండటంతో వారిలో అలజడి మొదలైంది. ఏదిఏమైనా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు జిల్లాలో విజయవంతం చేయడంలో ఆశాఖాధికారులు సఫలీకృతులవుతున్నారు.

సారాపై ఎక్సైజ్ ఉక్కుపాదం మోపింది. మద్యం అమ్మకాలతో సారాకు చెక్ పెట్టే దిశగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కసరత్తు చేస్తోంది. ఆదిశగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తుండటంతో రాష్ట్రస్థాయి అధికారుల చూపు జిల్లాపై పడింది. ప్రభుత్వం రూ.99 కే చీప్ లిక్కర్‌ను సారా స్థానంలో అందిస్తోంది. రెండు నెలలుగా నవోదయం-2.0 అమలు ప్రక్రియలో నాటు సారా రహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్ శాఖ కృషిచేస్తుంది. జిల్లాలో ఈనెల మద్యం అమ్మకాలు వంద కోట్ల టార్గెట్‌గా సాగుతున్నాయి. గత ఏడాదీ మే నెలలో రూ. 68 కోట్ల అమ్మకాలు జరిగితే ఈ ఏడాదీ మే నెలలో అంతకు మించి రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానంలో అమ్మకాలు జరగడం చర్చనీయాంశమైంది. సారా అరికట్టె విధానంపై ఆశాఖ రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ జిల్లాలో పర్యటించి పరిశీలించారు. జిల్లా కేంద్రంలో అధికారులతో సమావేశం అనంతరం జిల్లాలోని రాష్ట్ర సరిహద్దు పరిసరాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు.

ఒక్కసారిగా అలజడి: సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న వారిని గుర్తించి వారితో పాటు తయారీ, అమ్మదారులపై బైండోవర్, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయడంతో అక్రమ వ్యాపారుల్లో ఒక్క సారిగా అలజడి రేగింది. కేసులకు భయపడి జిల్లాలో ఇప్పటికే 52 గ్రామాల్లో సారా పూర్తిగా లేకుండా చేయగలగడంతో సారారహిత గ్రామాలుగా జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యం వైపు పోలీసుల నుంచి ఇబ్బం దులు తలెత్తకుండా సారా అమ్మకందారులు రూ.99 మద్యంతో పాటు, బెల్టుషాపులవైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం ఉంది. దీనికి తోడు కర్ణాటక బార్డర్ ప్రాంతాలైన ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో కర్ణాటకకు చెందిన టెట్రా ప్యాకెట్లు చౌకగా లభిస్తున్నాయి. సారా స్థానంలో వాటిని కూడా కొందరు అమ్మకాలు చేస్తుండటంతో దాదాపుగా సారా తయారీ, అమ్మకాలకు డిమాండ్ తగ్గిందనే చెప్పాలి.



జిల్లా సరిహద్దులో చెక్ పోస్టులను పరిశీలిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ(ఫైల్)



110 సారా ప్రభావిత గ్రామాలు: కర్నూలు జిల్లాలో 484 గ్రామాలు, మజరా గ్రామాలు 30 ఉండగా అందులో 110 సారా ప్రభావిత గ్రామాలున్నాయని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ లెక్కలు సూచిస్తున్నాయి. సారా ప్రభావిత గ్రామాల్లో ఇప్పటికే జిల్లా యంత్రాంగం 52 గ్రామాల్లో సారా అమ్మకాలు లేకుండా చేశారని గ్రామాల్లో గ్రామ పెద్దల సమక్షంలో తహసీల్దార్, వీఆర్వో, వీఆర్ఏ, ఎక్సైజ్ శాఖ అధికారుల సమక్షంలో సారా రహిత గ్రామాలను ప్రకటించారు.

మందు బాబులను ఆకర్షించే తీరులో ఎక్సైజ్ శాఖ ప్రచారం చేస్తోంది. సారా ప్రభావిత గ్రామాల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు ఆధ్వర్యంలో కేర్ కమిటీల సమన్వయంతో 73 సదస్సుల ద్వారా ప్రజలో సారా వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై చైతన్యం కలిగించిన తీరును డైరెక్టర్ అడిగి తెలుసుకున్నారని అధికారులు తెలిపారు. సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందు పక్క ప్రణాళికతో జిల్లా ఎక్సైజ్ అధికారులు రోజుగా వారిగా చేపడుతున్న ప్రక్రియను డైరెక్టర్‌కు వివరించారు. ఈ తరహ తీరును రాష్ట్రస్థాయిలో అమలుచేసే దిశగా ప్రత్యేక కార్యాచరణ ర్యచరణ రూపొందిస్తే బాగుంటుందని అధికారులతో చర్చించినట్లు సమాచారం.

రూ.99 మద్యంతో చెక్..: రూ.99 మద్యంతో సారా అమ్మకందారులకు అమ్మేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సారాకు సమానంగా, నాణ్యతతో ఉండటంతో పాటు ధరతక్కువ కావడంతో మందు బాబులు కూడా వాటిని కొనుగోలు చేస్తున్నారు.

డ్రోన్లతో స్థావరాల గుర్తింపు

బెల్లం అమ్మకందారులు, సారా తయారీ స్థావరాలు, అమ్మకం దారులను డ్రోన్ల సహాయంతో గుర్తించి వరుస కేసులు నమోదు చేస్తుండటంతో సారాకు దూరంగా ఉంటున్నారనే ప్రచారం ఉంది. కొండ, గుట్టల్లో రహస్య స్థావరాలను సైతం క్షణాల్లో గుర్తించడంతో వారి ఆగడాలకు ఎక్సైజ్ శాఖ చెక్ పెడుతోంది. నిరంతం కొన్ని బృందాలను ఏర్పాటుచేసి సారా నిర్మూలన కోసం పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

బంగారు పేట కేసులో ఏడుగురికి ఐదేళ్ల శిక్ష

కర్నూలు నగరంలోని బంగారుపేటలో సారా తయారీని అరికట్టే దిశగా కాలనీల్లోకి రోడ్ల నిర్మాణ ప్రక్రియలో వివాదం తెలిసిందే. అప్పట్లో పోలీసులపై ఎదురు దాడికి దిగడంతో సారా, ఎక్సైజ్ పోలీసులపై దాడి కేసుల్లో ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ ఘటనలో వారికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. ప్రస్తుతం సారా తయారీదారుల్లో ఒక్కసారిగా దడ మొదలైంది. సారా తయారీ, అమ్మకాలకు భయపడుతున్నారు.

పొగ చూరుతున్న జీవితాలు



కర్నూలు హాస్పిటల్/ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): సరదాగా, ఆకతాయిగా ప్రారంభమైన ఓ చిన్న అలవాటు... ఆపై వారి భవిష్యత్తును నాశనం చేస్తుంది.. ఆర్థికంగా, శారీరకంగా కుంగదీస్తుంది. అనేక కుటుంబాల్లో ఆలుమగల మధ్య పొగ పెడుతోంది. చివరికి ఆ కుటుంబాలను నాశనం చేస్తుంది. ఆ అలవాటే ధూమపానం. ఈ అలవాటు దీర్ఘకాలంగా ఉంటే ప్రాణాంతకమైన వ్యసనంగా పేర్కొనవచ్చు. కొందరికి సరదా... మరికొందరికీ ఫ్యాషన్ పేరేదైనా ఒక్కసారి సిగరెట్ అలవాటు వాడితే వ్యసనంగా మారుతుంది. ధూమపానం చివరికి ప్రాణాలను హరిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారతదేశంలో ప్రతి సంవత్సరం 13 లక్షల మరణాలు పొగాకు వినియోగం వల్ల కలుగుతున్నాయి. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

- ప్రాణాలు తీస్తున్న సిగరెట్లు
- పొగాకు వాడకంతో పెరుగుతున్న క్యాన్సర్ జబ్బులు
- దీర్ఘకాల వ్యాధులకు అవకాశం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

ఏటా రూ.250 కోట్లు బుగ్గి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిత్యం లక్షల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇందుకు నెలకు రూ.15 నుంచి రూ.17 కోట్లు సిగరెట్లు, బీడీ, చుట్టలు, గుట్కాలు, జర్దాల అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా యువత ఉండే ప్రాంతాలు, విద్యాసంస్థల సమీపంలో పొగరాయుళ్ల స్థావరాలుగా మారుతున్నాయి. ఉదహరణకు ఒక వ్యక్తి ఓ కంపెనీకి చెందిన సిగరెట్‌ను రోజుకు రెండు ప్యాకెట్లు కాలుస్తున్నారు. ఒక్క ప్యాకెట్ రూ.150 రోజుకు రూ.300 ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.9వేలు ఏడాదికి రూ.1.08 లక్షలు సిగరెట్లకు ఖర్చు చేస్తుండటం గమనార్హం.

శిక్షలు కఠినమే.. ప్రచారం నిల్..

2003 పొగాకు నిషేధ చట్టం ప్రకారం విద్యాలయాలకు వంద గజాల దూరంగా ఎలాంటి పొగాకు విక్రయ కేంద్రాలు ఉండకూడదు. బహిరంగంగా పొగతాగుతూ అధికారులకు పట్టుబడితే తొలిసారి రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి జరిమానా, రెండోసారి పట్టుబడితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 500 జరిమానా, ఒక్కో సందర్భంలో రెండు శిక్షలు అమలుచేయవచ్చు. అయితే ఈ చట్టం ఆచరణలో లేకపోవడంతో పొగరాయుళ్ల ఆటలు సాగుతున్నాయి. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో పొగత్రాగే వారిపై చలానాలతో జరిమానా విధించే అధికారం ఉన్నా ఎక్కడా కూడా అధికారులు ఒక్క చలానా కూడా రాసిన దాఖలాలు లేవు. ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన జిల్లా మాస్ మీడియా విభాగం మొద్దు నిద్రపోతుంది.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వసతులు

- స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వారంలో ప్రతి మంగళ, గురువారాల్లో వైద్యులు ప్రత్యేకంగా పొగాకు బాధితులకు ఓపీ నిర్వహిస్తున్నారు.
- పొగాకు నియంత్రించేందుకు ఓపీ నెంబరు 222లో మానసిక వైద్యులచే కౌన్సిలింగ్, చికిత్స అందిస్తున్నారు.
- క్యాన్సర్ నివారణ ఓపీలో అన్ని రకాల క్యాన్సర్ నివారణ పరీక్షలు, నోటి క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడానికి తగిన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

పొగాకు క్యాన్సర్‌కు కారకం



సిగరెట్లు, చుట్టలు, బీడీలు తదితరాలను తీసుకున్న మరుక్షణం నుంచి శరీరంలోని అన్ని అవయవాల మీద విపరీతమైన ప్రభావం చూపుతాయి. పొగాకు సంపూర్ణ క్యాన్సర్‌కు కారణమవుతుంది. పొగాకులోని నికోటిన్ విష తుల్యాలు ఊపిరితిత్తులు, నోటి, అన్నవాహిక, జీర్ణాశయ క్యాన్సర్‌కు దారితీస్తాయి. ఇటీవల కొత్తగా ప్రారంభించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఓపీ నెంబరు 222లో క్యాన్సర్ నివారణ విభాగాన్ని ఏర్పాటు చేశాం.

– డాక్టర్ కె.శివప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ అంకాలజీ, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్

పొగాకుతో ప్రమాదకర వ్యాధులు



పొగాకు వల్ల ఊపిరితిత్తుల్లో ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిజార్డర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సంభవిస్తాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం కలిగించడమే కాకుండా గొంతు క్యాన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం వుంటుంది. ధూమపానాన్ని పూర్తిగా నిషేధించాలి.

– డాక్టర్ రాయుడు, ఆత్మకూరు

పొగాకు వాడకం హానికరం



పొగాకు మూలంగా పెదవి, నోరు, నాలుక, అన్నవాహిక, జీర్ణాశయం ఊపిరితిత్తులు, ప్రాంక్లియాస్, మూత్రాశయం వంటి క్యాన్సర్లు వస్తాయి. కొందరు జర్దా, గుట్కా, ఖైనీలను నోట్ల పెట్టుకుని నములుతుంటారు. ఇలా పొగ, లాలాజలం ద్వారా క్యాన్సర్ కారకాలు రక్తంలోకి అక్కడి నుంచి వివిధ అవయవాలకు చేరి ప్రమాదకరంగా మారుతాయి.

– డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ హాస్పిటల్, కర్నూలు

ముఖ పరీక్ష తప్పనిసరి



పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల నోటి క్యాన్సర్, అన్నవాహిక, జీర్ణాశయ, ఊపిరితిత్తులు, మూత్రాశయం, కిడ్నీ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. దంతాల ఇన్ఫెక్షన్, చిగుళ్ల వాపు, నోటిలో పుండ్లు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వారం రోజుల్లో ఈ ఇన్‌ఫెక్షన్లు తగ్గకపోతే ముఖ పరీక్ష, బయాప్సీ పరీక్షలు తప్పక చేయించుకోవాలి. ఇటీవల కాలంలో నోటి క్యాన్సర్లు పురుషులతో పాటు మహిళల్లో కూడా కనిపిస్తున్నాయి. గొంతు బొంగురుగా ఉండటం, గొంతుకు ఏదో అడ్డుగా ఉన్నట్లు అనిపిస్తే క్యాన్సర్ వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ బి.రవీంద్రబాబు, సర్జికల్ అంకాలజిస్టు, ఓమేగా హాస్పిటల్, కర్నూలు

- పొగతో ఆరోగ్యం క్షీణించి ఆయు ప్రమాణం క్రమేపి తగ్గుతుంది. సిగరెట్ తాగే వారితో పోలిస్తే సిగరెట్ తాగని వారి ఆయుష్ ప్రమాణం కనిష్టంగా మూడేళ్ల అధికంగా ఉంటుంది.
- ఈ రోజు సిగరెట్ మానేసిన శరీరంలోని దాని అవశేషాలు పూర్తిగా తొలగిపోయేందుకు మూడేళ్ల కాలం పడుతుంది.
- కళ్లు, ముక్కు, గొంతు వంటి సున్నితమై న పొరలపై పొగ తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది కేన్సర్‌లకు దారితీస్తుంది.
- దగ్గు, కఫం, అల్సర్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు జటిలం అవుతాయి.
- శ్వాసనాళం మందంగా మారిపోయి కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. చలి, జ్వరం, ఫ్లూవంటివి త్వరగా వ్యాప్తిచెందుతాయి.

వివిధ కేన్సర్‌లు, అనేక జబ్బులు ఉచితం

- ఊపిరితిత్తుల్లో పొగచేరితే గుండె ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది. దీని వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ.
- సిగరెట్ కాల్చిన ప్రతిసారి రక్తపోటు అమాంతంగా 15శాతం పెరుగుతుంది. దీనివల్ల కోపం, అసహనం, ఆందోళన పెరుగుతాయి.
- చర్మంలో రక్తనాళాలు బిగుసుకుపోతాయి. ఆక్సిజన్ సరఫరా దానంతట అదే తగ్గుతుంది. ఫలితంగా ఆయాసం వస్తుంది.
- ఊపిరితిత్తులు, నోరు అన్నవాహికకే కాకుండా మెడ, స్వరపేటిక, మూత్రాశయం, మూత్రపిండాలు, జీర్ణాశయం వంటి అవయవాలకు కేన్సర్ సోకే ప్రమాదం లేకపోలేదు.



సిద్ధేశ్వరానికి తొమ్మిదేళ్లు



2016 మే 31న కపిలేశ్వరం వద్ద శంకుస్థాపన చేసిన దృశ్యం (ఫైల్)

3వ పేజీ తరువాయి

ప్రధాన డిమాండ్లు ఇవే

- శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి రాయలసీమ హక్కుగా తాగు, సాగు నీరు అందించాలి.
- కృష్ణా యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి.
- యువత భవితకు విద్యాలయాలు, పరిశ్రమల ఏర్పాటుతో పాటు అమరావతిని ఫ్రీజోన్ చేయాలి
- రాష్ట్ర విభజన చట్టంలోని ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు, జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైకోర్టు, రాష్ట్ర స్థాయి కార్యాలయాలు, కార్పొరేషన్లు సీమలో ఏర్పాటు చేయాలి.
- హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలి.
- రూ.1500కోట్లతో వచ్చే ఖరీఫ్‌కు 10లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేపట్టాలి. శ్రీశైల జలాశయం ముంపు గ్రామాలకు తాగు, సాగునీరుతో పాటు నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి.
- గుండ్రేవుల, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి.
- రాయలసీమలోని కార్యాలయాల తరలింపును నిలిపివేయాలి.
- శ్రీశైలం ప్రాజెక్ట్ పరిరక్షణకకు ప్లంజ్‌పూల్ మరమ్మతులు, పూడిక నివారించి రిజర్వాయర్ జీవిత కాలాన్ని పెంచడానికి సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం నిర్మించాలి.

నేడు భారీ బహిరంగ సభ

రాయలసీమ సాగునీటి సాధన సమితి పిలుపు మేరకు జలమే జీవం.. జలమే బలం.. జలమే సర్వం.. అనే నినాదంతో శనివారం సంగమేశ్వరం వద్ద భారీ బహిరంగ సభను జరపనున్నారు. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చేలా సాధన సమితి ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే రాయలసీమకు ప్రయోజనం



సిద్ధేశ్వరం అలుగు నిర్మిస్తేనే సీమ జిల్లాలకు మేలు జరుగుతుంది. రాయలసీమకు నీటి పంపకాల్లో తీవ్ర అన్యాయం జరిగింది. శాంతియుతంగా రాయలసీమలోని అన్నివర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు ఇస్తున్నాం.

-బొజ్జా దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి, కన్వీనర్

పింఛన్ ఇప్పించండి సార్..!

ఓ వృద్ధురాలి దీనగాథ..



హొళగుంద, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆమె వయసు 75 సంవత్సరాలు. చెవులు కూడా సరిగ్గా వినపడవు. అతి కష్టం మీద అడుగులు వేసే ఆ వృద్ధురాలు పింఛన్ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది హొళగుంద మండలం ముద్దటామాగి గ్రామానికి చెందిన మూతల బసమ్మ. రెండు రోజుల క్రితం ముద్దటామాగి గ్రామానికి వచ్చిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి పింఛన్ ఇప్పించాలని ఆమె వేడుకున్న తీరు అందర్నీ కలచివేసింది. 'సార్.. నా వయసు 75 ఏళ్లు. ఆరోగ్యం పోయింది. సరిగ్గా వినపడదు. బయటకు పోదామంటే సరిగ్గా నడవలేను. పింఛన్ లేదయ్యా... సచ్చిపోయేలోపు అయినా పింఛన్ ఇప్పించం డయ్యా..' అంటూ ఓ వృద్ధురాలు సబ్ కలెక్టర్ ఎదుట కన్నీటిపర్యంతమైంది. అయినా పింఛన్‌పై అధికారులు ఎవరూ స్పందించక పోవడంతో శుక్రవారం ఆ వృద్ధురాలు ఎంపీడీవో కార్యాలయానికి అతి కష్టంపై నడుచుకుంటూ వచ్చింది. అయితే ఆమె వచ్చిన సమయంలో సంబంధిత అధికారి లేకపోవడంతో వృద్ధురాలు బసమ్మ నిరాశగా వెనుదిరిగింది. తనకు భర్త కూడా లేడని.. బిడ్డల సంపాదన వారికే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు పింఛన్ అందిస్తే ఈ వయసులో ఆసరాగా ఉంటుందని ఆమె కనిపించిన ప్రతి ఒక్కరినీ వేడుకుంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వయసులో ఆమెను ఇబ్బంది పెట్టకుండా పింఛన్ అందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను పింఛన్ ఇప్పించాలని కోరుతున్న వృద్ధురాలు బసమ్మ (ఫైల్)

డీసీసీబీ అభివృద్ధికి కృషి

చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



ప్రభుత్వ ఉత్తర్వులను చైర్మన్ విష్ణుకు అందజేస్తున్న సీఈవో రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన విష్ణువర్ధన్ రెడ్డికి నియామక ఉత్తర్వులను బ్యాంకు సీఈవో రామాంజనేయులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఈవో రామాంజనేయులు, ఆప్కాబ్ అధికారి విజయకుమార్‌తో బ్యాంకు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విష్ణువర్ధన్ రెడ్డి చర్చించారు. వాణిజ్య బ్యాంకులతో పోటీ పడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ముందంజలో తీసుకురావాలన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు బ్యాంకు ద్వారా అన్నిరకాల కార్యక్రమాలు, పథకాలను అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సీఈవో రామాంజనేయులు మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు, సిబ్బందితో కలిసి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేసేందుకు వేగవంతంగా కార్యక్రమాల అమలు, రుణాల పంపిణీ, కంప్యూటీకరణ తదితర పనులను ప్రతి సంఘంలోనూ పూర్తి చేసినట్లు తెలిపారు.

ఉత్తమ కథలే సినిమాలకు ప్రాణం

సినీ డైరెక్టర్ రక్షా వీరం



కథా రచయితలతో మాట్లాడుతున్న సినీ దర్శకుడు రక్షా వీరం

కర్నూలు కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మంచి సినిమాకు ఉత్తమ కథలే ప్రాణం పోస్తాయని 'పోతుగడ్డ' సినిమా దర్శకుడు రక్షా వీరం అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలుకు చెందిన కథా రచయితలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షా వీరం మాట్లాడుతూ సినీ ప్రపంచంలో కొత్తదనంతోపాటూ మంచి కథ ఉండాలని, అయితే అన్నీ కమర్షియల్ అనడం సరైంది కాదని చెప్పారు. పోతుగడ్డ చిత్రానికి నేపథ్యం కర్నూలు ప్రాంతమేనని గుర్తు చేశారు. విస్తృత సాహిత్యం వల్ల అనేక మంచి కథలు పుట్టుకువస్తాయని, కథాసాహిత్యం ఎంత గొప్పగా ఉంటే అన్ని మంచి కథలు సినీ రంగానికి ఊతమిస్తాయని చెప్పారు. రాయలసీమ ప్రాంతం నుంచీ గొప్ప కథకులు ఉన్నారని ప్రశంసించారు. గతంతో పాటూ ప్రస్తుతం కూడా అనేక సినిమా కథలు రాయలసీమ ప్రాంతంతో ముడిపెట్టినవేనని, అవి గొప్పగా విజయవంతం అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు, రచయితలు పౌరోహితం మారుతి, ఎస్‌డీవీ అజీజ్, తెలకపల్లి మధుసూదన శర్మ, కవులు డి. పార్వతయ్య, నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా, ఆద్య మెడికల్స్ అధినేత ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

- ఆస్పత్రి రెండో ప్రధాన ద్వారం తెరవండి
- పార్కింగ్ స్థలాలను గుర్తించండి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కర్నూలు జీజీహెచ్ అభివృద్ధిపై మంత్రి సమీక్ష

కర్నూలు హాస్పిటల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ, మున్సిపల్, హార్టికల్చర్, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం గుర్తించబడిన పార్కింగ్ స్థలాలను మెరుగుపరచాలని అత్యవసర ప్రాంతాల నుంచి వార్డులకు ఇతర క్లిష్టమైన ప్రాంతాలకు ట్రాలీలు, వీల్ చైర్లు కదలిక కోసం ప్రత్యేకంగా రోడ్లను మెరుగుపరచాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలోకి రావడానికి 2వ గేటును తెరవడానికి దాన్ని త్వరలో అందుబాటులోనికి తీసుకురావాలని ఆదేశించారు. కొత్త సిటీ స్కాన్‌ను వచ్చే నెల 9వ తేదీన ప్రారంభించాలని, అన్ని ఐసీయూ, ఓటీ వెంటిలేటర్లు వంటి క్లిష్టమైన పరికరాల్లో ఓపీఎస్, జనరేటర్, ఇన్వర్టర్ సౌకర్యం కనెక్షన్ ఉండేలా చూడాలన్నారు. సీఎంఎస్ విధానంలో విద్యుత్ పరికరాలు ఏసీలు, జనరేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ పరికరాల నిర్వహణ ఉందని, ఏపీఎస్‌పీడీఎస్ఎల్ ఎస్ఈతో మాట్లాడి వెంటనే ఏఈని నియమించాలని జడీ సీఈవోను ఆదేశించారు. ఆసుపత్రిలో పోస్టులు ఖాళీ ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి. సింధూ సుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ కరీముల్లా, హెచ్‌డీఎస్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి

రౌడీ షీటర్లకు ముమ్మరంగా కౌన్సెలింగ్

- ఆకస్మిక తనిఖీలతో పోలీసుల నిఘా
- రౌడీషీటర్ల ఆగడాలు తగ్గుముఖం

కర్నూలు క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై పోలీసు యంత్రాంగం కఠిన వైఖరి అవలంబిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ లేక వారి ఆగడాలు మితిమీరిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఈ రౌడీషీటర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో రౌడీషీటర్లకు తీవ్రస్థాయిలో కౌన్సెలింగ్ ఇవ్వాలంటూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ఆదివారం రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిపించి హెచ్చరిస్తున్నారు. మట్కా, పేకాట కేసుల్లో ఉన్న వారిపై నిఘా మరింత కట్టుదిట్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,284 మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఆదోని సబ్ డివిజన్ పరిధిలో 154 మంది, కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో 466 మంది, పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలో 308 మంది, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో 356 మంది రౌడీషీటర్లు ఉన్నారు.

- అత్యధికంగా కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 127 మంది ఉండగా.. కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలో 103 మంది, ఆస్పరి పోలీస్ స్టేషన్ పరిధిలో 74 మంది, కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో 73 మంది, కోసిగి పోలీస్ స్టేషన్ పరిధిలో 71 మంది, ఆదోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లో 62 మంది, ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో 62 మంది రౌడీ షీటర్లు ఉన్నారు.
- అత్యల్పంగా నాగులాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు, మద్దికెర పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు ఉన్నారు. మొత్తం రౌడీషీటర్లలో 23 మంది రౌడీసీటర్లపై 10కి పైగా కేసులు ఉన్నాయి. ఒక్క హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఆరుగురిపై పదికి పైగా కేసులు ఉన్నాయి.
- జిల్లా వ్యాప్తంగా 44 మంది కిరాయి హంతకులు ఉన్నారు. ఆదోని సబ్ డివిజన్ పరిధిలో ఒకరు, కర్నూలు సబ్ డివి జన్ పరిధిలో 20 మంది, పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలో 18 మంది, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో ఐదుగురు ఉన్నారు.



షరీఫ్‌నగర్‌లో కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు(ఫైల్)

ఆకస్మిక తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా పోలీసులు కార్డెన్ సెర్చ్ పేరుతో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. వారానికి ఒకసారైనా సమస్యాత్మక కాలనీల్లో తెల్లవారుజామునే స్పెషల్ పార్టీ బృందాలతో వెళ్లి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పాత నేరస్థుల కార్యకలాపాలపై నిఘా ఉంచుతున్నారు. ముఖ్యంగా ట్రబుల్ మాంగర్స్ ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ నెల 22న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో తనిఖీలు చేసి 12 రికార్డులు లేని బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 5న వీకర్ సెక్షన్ కాలనీలో కార్డెన్ సెర్చ్ చేసి 10 ద్విచక్రవాహనాలు, 10 ప్యాకెట్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

క్రస్ట్ గేట్లను పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ



క్రస్ట్ గేట్లను పరిశీలిస్తున్న ఈఈ పాండురంగయ్య

గోనెగండ్ల, మే 30(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను శుక్రవారం జిల్లా ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య పరిశీలించారు. ప్రాజెక్టుకు ఉన్న ఆరు గేట్లలో నాలుగు పూర్తిస్థాయిలో మరమ్మతు అయ్యాయి. మిగతా రెండు పూర్తి కాలేదు. వర్షాలు ప్రారంభం కావడంతో గేట్ల మరమ్మతు పనులు వేగవంతంగా చేయాలని ఈఈ పాండురంగయ్య జీడీపీ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జీడీపీలో ఎంత నీరు ఉన్నది?.. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వరద నీరు ఎంత వచ్చింది? అని డీఈ విజయ్‌కుమర్‌ను అడిగి తెలుసుకున్నారు. గేట్లకు జరిగే మరమ్మతు పనులను దగ్గర ఉండి పరిశీలించారు.

భార్య, అత్తపై వేట కొడవలితో దాడి

పెద్దకడబూరు , మే 30(ఆంధ్రజ్యోతి): భార్య, అత్తపై వేట కొడవలితో ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ సంఘటన మండలంలోని కంబదహాల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన జయమ్మ కూమార్తె రేణుక అలియాస్ జయంతిని ఆలూరు మండలం అంగస్కల్ గ్రామానికి చెందిన వేమారెడ్డికి ఇచ్చి 16 ఏళ్ల క్రితం వివాహం చేశారు. కుటుంబ కలహాలతో మనస్పర్థలు వచ్చి జయంతి మూడేళ్లుగా కంబదహాల్ గ్రామాంలోనే తల్లి జయమ్మ వద్ద ఉంటున్నది. ఈ నేపథ్యంలో తనకు విడాకులు కావాలని భర్త వేమారెడ్డి కోర్టుకు వెళ్లాడు. పైగా ఫోన్ చేసి చంపుతానని బెదిరిస్తున్నాడు. శుక్రవారం ఉదయం వేమారెడ్డి అత్త ఇంటికి వెళ్లి వెంట తీసుకెళ్లిన వేట కొడవలితో దాడి చేయడంతో భార్య జయంతి, అత్త జయమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు జయంతి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

ఇద్దరికి తీవ్రగాయాలు



మృతి చెందిన రైతు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



కురువ రామన్న (ఫైల్)

మంత్రాలయం, మే 30 (ఆంధ్రజ్యోతి): తన పొలంలో విత్తనాలు నాటి మోటారు సైకిల్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొని రైతు కురువ రామన్న(62) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం శుక్రవారం జరిగింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెట్నహళ్లి గ్రామానికి చెందిన రామన్న తన పొలంలో విత్తనాలు నాటి, తన మనవడు ఆరేళ్ల కృష్ణకుమార్‌ను బైక్ వెనుకాల కూర్చుబెట్టుకుని ఇంటికి బయల్దేరాడు. మంత్రాలయం నుంచి మాధవరానికి ఇద్దరు వ్యక్తులతో వస్తున్న మరో బైక్ వీరి బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామన్న అక్కడికక్కడే మృతి చెందగా.. కృష్ణకుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తిరుమల డెయిరీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న ఆదోని ఆవన్నపేటకు చెందిన టి. పాండురంగ, రాంపురానికి చెందిన రఘు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి మృతదేహాన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించడంలో సహకరించాడు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన మట్టిమిద్దెలు

చాగలమర్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో వర్షాలకు తడిసిన మట్టిమిద్దెలు శుక్రవారం పాక్షికంగా కూలిపోయాయి. గ్రామానికి చెందిన బాలకృష్ణ, చెన్నమ్మ మట్టిమిద్దెలు కుప్పకూలి నష్టం వాటిల్లింది. గృహంలో ఎవరు లేని సమయంలో కూలిపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వపరంగా సాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పదోన్నతుల కోసం ఎదురుచూపులు!

ఆలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీరిని ఏమాత్రం పట్టించుకోకపోగా పదోన్నతులతోపాటు పీఆర్‌సీని కూడా పక్కన పెట్టిందని ఉద్యోగులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులు 19 నుంచి 23 యేళ్లుగా పనిచేస్తున్నారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా పదోన్నతులు కూడా కల్పించలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మాతృశాఖలో పనిచేస్తున్న ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులకు టైం స్కేల్ అమలుకు శ్రీకారం చుట్టింది.

- ఏళ్ల తరబడి ఊసే లేదు
- కూటమి ప్రభుత్వం మీదే ఉపాధి హామీ ఉద్యోగుల ఆశలు

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే....

2014-2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్లను సాంకేతిక సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లకు, ఎంటీసీలకు అదనపు కార్యక్రమ అధికారుల(ఏపీవో)లుగాను, హెచ్‌ఆర్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్, ఈవోఆర్‌డీ కేడర్లలో (జీవోఆర్‌టీ నంబర్ 312, 2006) నియమితులైన ఏపీవోలు, ఈసీలు, కోర్స్ డైరెక్టర్లు, హెచ్‌ఆర్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్లు, సహాయ పథక సంచాలకులు(ఏపీడీ)గా పదోన్నతి పొందారు. ఏపీడీలు అడిషనల్ పీడీలుగా పదోన్నతి పొందారు. ఉపాధి హామీ పథకం అమలులో వస్తున్న మార్పులకు అనుగుణంగా అత్యున్నత పరిజ్ఞానంతో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం, అమలు పరచడం, పర్యవేక్షణ చేయడం, పరిపాలనపరమైన అంశాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధి హామీ ఉద్యోగులు అన్ని క్యాడర్లలో పదోన్నతులకు అర్హులేనని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ గ్రావెల్, బీటీ, సిమెంట్ రోడ్లు, సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీశక్తి, రైతుసేవా, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల ప్రహరీ నిర్మాణం తదితర మౌలిక వసతులు కల్పించడంలో ఉపాధి హామీ ఉద్యోగుల భాగస్వామ్యం అధికంగా ఉంది. అలాగే అటవీ, వ్యవసాయ, పంచాయతీరాజ్, విద్య, వైద్య, రైల్వే, జలవనరులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ మొదలైన ఇతర శాఖల సమన్వయంతో రైతు సంక్షేమ పథకాలు ఉపాధి హామీ ద్వారానే జరుగుతున్నాయి. ఇందులో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయ్ (ఎఫ్‌టీఈ) ఉద్యోగులకు గ్రామీణాభివృద్ధి శాఖలో 70 శాతం పదోన్నతి కల్పించాలనే డిమాండ్ ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో ఎస్ఆర్‌డీఎస్ కింద పనిచేస్తున్న ఎన్‌టీఈఈల నియామకం తేదీ తదితర పొరపాట్లను సరిదిద్దాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ప్రస్తుతం ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని, ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఎన్‌టీఈఈలుగా గుర్తించాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలో అన్ని క్యాడర్లలో దాదాపుగా 5 వేల మంది ఉద్యోగులు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాలు కూడా రాష్ట్ర మంత్రి లోకేశ్, నాదెండ్ల మనోహర్‌ను కలిసి కూడా విన్నవించారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

అన్ని క్యాడర్లలో ఉన్న ఉపాధి ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలి



2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పదోన్నతులు కల్పించాక తిరిగి ఆ ఊసేలేదు. అన్ని క్యాటగిరీ ఉద్యోగుల సర్వీసు, విద్యార్హతను పరిగణలోకి తీసుకుని పదోన్నతి కల్పించాలి.

పదోన్నతులపై మంత్రులకు విన్నవించాం



ఉపాధి హామీ పథకంలో యేళ్ల తరబడి పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు సర్వీసు, విద్యార్హతను పరిగణలోకి తీసుకుని ఇంజనీర్లుగా, ఏపీఓలుగా పదోన్నతి కల్పించాలి. ఇదే విషయంపై పంచాయతీరాజ్ కమిషనర్, మంత్రులు లోకేష్, నాదెండ్ల మనోహర్‌ను కలిసి విన్నవించాం.

- తిరుమలేష్, టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

బాల్య వివాహాలను అరికట్టాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ప్రసంగిస్తున్న బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, మే 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో జరిగిన ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడానికి అధికారులే కాకుండా పురోహితులు, పాస్టర్లు, ఖాజీలు కూడా కృషిచేయాలని ఆయన కోరారు. బాల్య వివాహాలను చేయాలని ఎవరైనా తమ వద్దకు వస్తే టోల్‌ఫ్రీ. నెంబర్.15100కు తెలియజేస్తే వెంటనే ఆ బాల్య వివాహాన్ని సంబంధిత అధికారులు నిలిపివేస్తారనీ తెలిపారు. కొత్తగా వచ్చిన చట్టాల ప్రకారం బాల్యవివాహాలు చేసిన వారికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష ఉంటుందని తెలిపారు. ఐసీడీఎస్ అధికారి శారద మాట్లాడుతూ బాల్య వివాహాలపై సమాచారం ఇస్తే వారు కూడా తగిన చర్యలు తీసుకుంటారనీ తెలిపారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తాము బాల్యవివాహాలను ప్రోత్సహించడం లేదని, బాల్య వివాహాల గురించి తెలిస్తే అధికారుల దృష్టికి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అనురాధ, డాక్టర్ ఉమాదేవి, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కిరణ్, ప్రభుత్వ ఖాజీ, మౌలానా సయ్యద్ అక్బర్‌బాషా, పాస్టర్ కృపాదానంరాజు పాల్గొన్నారు.

కందుల ధర పతనం

కర్నూలు అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి): గత నెల 21వ తేదీ నాటికే మార్క్‌ఫెడ్ అధికారులు కందుల కొనుగోళ్లను నిలిపివేశారు. రైతులు మరోదారి లేక తమ వద్ద ఉన్న కందులను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకువస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు కందుల ధరను తగ్గించి కొంటున్నారు. కందులు నాణ్యంగా లేవని, ఈక్రాప్ నమోదు చేసుకోలేదనే కారణాలతో మార్క్‌ఫెడ్ అధికారులు కందుల కొనుగోళ్లను నిలిపివేశారు. ఈ మాటలు అబద్ధమని, తమ వద్ద భారీగా స్థాయిలో నాణ్యమైన కందులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి 428 క్వింటాళ్ల కందులను అమ్మకానికి తెచ్చారు. ప్రభుత్వం కందులకు క్వింటానికి రూ.7,500 ధర ప్రకటించింది. అయితే.. కొనుగోలు కేంద్రాలు మూసివేయడంతో రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున విక్రయానికి తీసుకువస్తున్నారు. ఈ యార్డులో శుక్రవారం గరిష్ఠ ధర రూ.6,619, మధ్యస్థ ధర రూ.6,551, కనిష్ఠ ధర రూ.2,600 మాత్రమే రైతులకు దక్కింది. అదే విధంగా వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.6,669, మధ్యస్థ ధర రూ.3,539, కనిష్ఠ ధర రూ.2712 మాత్రమే రైతులకు అందింది.

12న నంద్యాలకు వైఎస్ షర్మిల రాక



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు లక్ష్మినరసింహ యాదవ్

నంద్యాల రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జూన్ 12వ తేదీన నంద్యాలలో పర్యటిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు జెంగిటి లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. వైఎస్ షర్మిల ఈనెల 12న నంద్యాల సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో జరుగే జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఆ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి రాష్ట్రంలో వైఎస్ షర్మిల పర్యటనలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల ఇంచార్జిలు మద్దిలేటిస్వామి, ఇస్మాయిల్, జనార్ధన్, బాలస్వామి, బోయ రమణ, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ బలవన్మరణం

బేతంచెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపేటకు చెందిన నడ్డి వెంకటేశ్వర్లు (30) అనే ట్రాక్టర్ డ్రైవర్ మతి స్థిమితం సరిగ్గా లేక శుక్రవారం వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఘటన జరిగింది. వెంకటేశ్వర్లు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిస కావడం, మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో బలపాలపల్లె రస్తాలో ఉన్న అల్లాబకాష్ దర్గా వెనుక వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బేతంచెర్ల హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమ్మితం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఆగిన హంద్రీ విస్తరణ పనులు

కూటమి ప్రభుత్వం రూ.3,500 కోట్లతో హంద్రీ నీవా విస్తరణకు శ్రీకారం చుట్టింది. నంద్యాల, కర్నూలు జిల్లాలలో బ్యాలెన్స్ పనులు రూ.690 కోట్లతో చేపట్టారు. జూన్ 10లోగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అయితే.. అనుకోని ముందస్తు వర్షాల వల్ల పనులు ఆగిపోయాయి. కాల్వలో వర్షపునీరు చేరడంతో మట్టి, పూడికతీత పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు సగటున 49.072 శాతానికి మించి పనులు జగరలేదు. మిగిలన సమయం పది రోజులే. విస్తరణ పనులు పూర్తవుతాయా..? ఈ ఖరీఫ్‌లో 3,850 క్యూసెక్కులు కాలువకు మళ్లించడం సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- అనుకోని వర్షాలతో ఆగిన పురోగతి..!
- జూన్ 10లోగా పూర్తి చేయాలని లక్ష్యం.. పురోగతి 50 శాతంలోపే
- పది రోజుల్లో పూర్తి చేయడం సాధ్యమేనా..?

కర్నూలు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో 3,850 క్యూసెక్కులు ప్రవాహానికి వీలుగా హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకెళ్లాలనే ఆశయంతో హంద్రీనీవా విస్తరణ, సీసీ లైనింగ్ పనులు ప్రాధాన్యతగా చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో రూ.960 కోట్లలో బ్యాలెన్స్ విస్తరణ పనులు మొదలు పెట్టి జూన్ 10వ తేదిలోగా పూర్తి చేయాలని టార్గెట్ పెట్టారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వారం వారం పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ప్యాకేజీ-1 కింద రూ.260 కోట్లతో చేపట్టే 0/0 నుంచి 88 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు మెగా ఇన్‌ఫ్రా సంస్థ, ప్యాకేజీ-2 కింద రూ.430 కోట్లతో చేపట్టిన 88 కి.మీలు నుంచి 201 కిలో మీటర్లు వరకు విస్తరణ పనులు డీఎస్‌ఆర్-వీపీఆర్ సంస్థలు జాయింట్ వెంచర్‌గా దక్కించుకొని పనులు చేపట్టాయి. ప్యాకేజీ-1లో 37.79 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టి పనులకు గాను 18.92 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టి పనులు (50.084 శాతం) చేశారు. ప్యాకేజీ-2 పరిధిలో 36.45 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులకు గాను 17.52 లక్షల క్యూబిక్ మీటర్లు (48.06 శాతం) పనులు చేశారు. అంటే.. సగటున 49.072 శాతం పురోగతి సాధించారు. లక్ష్యం మేరకు జూన్ 10లోగా విస్తరణ పనులు చేయాలి. మిగిలిన సమయం కేవలం పది రోజులే. అయితే.. ఈ నెల 16 నుంచి 26వ తేది వరకు జిల్లాలో కురిసిన ముందస్తు వానల వల్ల వర్షపు నీరు కాలువలో చేరింది. అంతేకాదు.. నల్లరేగడి నేలల్లో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీంతో పురోగతి మందగించింది.

3,850 క్యూసెక్కులు తీసుకోవడం సాధ్యమా..?

కర్ణాటకలో కురిసిన ముందస్తు వర్షాలు కారణంగా ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో గేట్లెత్తి దిగువ శ్రీశైలం డ్యాంకు 97,659 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువన కర్ణాటకలో, మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు పడితే ముందే డ్యాం నిండవచ్చని సాగునీటి నిపుణులు అంచనా వేస్తున్నారు. అదేజరిగితే మల్యాల సహా వివిధ ఎత్తిపోతల పథకాల పంపులు ఆన్‌చేసి హంద్రీనీవాకు నీటిని తీసుకునే అవకాశం ఉంది. ఆలోగా విస్తరణ పనులు పూర్తయితే 3,850 క్యూసెక్కులు తీసుకోవచ్చు. ఒకటి రెండు కిలోమీటర్లు విస్తరణ పనులు ఆగిపోయినా ఈ ఏడాది కూడా రెండు వేల క్యూసెక్కులతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో పనులు చేసే కాంట్రాక్ట్ సంస్థలు, పర్యవేక్షించే ఇంజనీర్లు ప్రతిష్టాత్మంగా రేయింబవళ్లు పనులు చేస్తే తప్ప గడువులోగా పనులు పూర్తవ్వడం కష్టమని పలువురు పేర్కొంటున్నారు.

- మట్టి పనులు పురోగతి వివరాలు. (లక్షల క్యూబిక్ మీటర్లల్లో):

ప్యాకేజీ	చేయాల్సింది	చేసింది
ప్యాకేజీ -1	37.79	18.92
ప్యాకేజీ-2	36.45	17.52
మొత్తం	74.24	36.34

వర్షం వల్ల పనులు ఆగినమాట నిజమే



హంద్రీనీవా కాలువ ద్వారా 3,850 క్యూసెక్కులు తీసుకోవడానికి వీలుగా విస్తరణ పనులు చేపట్టాం. రెండు ప్యాకేజీల్లో 74.24 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 36.34 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు చేశాం. జూన్ 16 నుంచి అనుకోకుండా ముందస్తు వర్షాలు రావడంతో పనులు ఆగిపోయిన మాట నిజమే. గడువులోగా పూర్తి చేస్తాం.

- పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీనీవా ప్రాజెక్టు సర్కిల్-1, కర్నూలు



హంద్రీనీవా కాలువ 53.700 కి.మీల వద్ద పూడికతీత పనులు



హంద్రీనీవా కాలువ 8.900 కి.మీలు వద్ద జరుగుతున్న విస్తరణ పనులు



హంద్రీనీవా కాలువ 118 కి.మీల వద్ద సీసీ లైనింగ్ పనులు

భారీగా తగ్గిన ఆదాయం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు, మే30(ఆంధ్రజ్యోతి): స్థానిక జనార్దన, ఆంజనేయ స్వాములకు చెందిన 17.30 ఎకరాల ఆలయ భూములకు వేలంలో ఆదాయం భారీగా తగ్గింది. శుక్రవారం పరిశీలకుడు గోపి సమక్షంలో ఈవో ఆకృతి నాగప్రసాద్ వేలం నిర్వహించారు. గత ఏడాది ఇవే భూములకు రూ.4,78,000 రాగా ఈఏడాది రూ.3,61,000 మాత్రమే లభించిందని ఈవో తెలిపారు. గతం కన్నా రూ.1,17,000 రాబడి తగ్గిపోయిందన్నారు. ఈఏడాది పొగాకు, మిర్చి పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవటంతో కౌలు భూములపై రైతులు ఆసక్తి చూపలేక పోతున్నారు.

సర్వేను నిలిపివేయాలి


మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియాకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూరు, మే 31(ఆంధ్ర జ్యోతి): మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటి పన్నుల పెంపు సర్వేను నిలిపివేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ రమేష్‌బాబు, చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియాకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి 15శాతం పెంచాలని నిర్ణయించిన పన్నుల భారాన్ని రద్దుచేయాలన్నారు. అనధికార నిర్మాణాల పేరిట 25శాతం నుంచి 100వరకు జరిమానా విధించే ఆలోచనలను విరమించుకోవాలని అన్నారు. ఈవిషయంలో ప్రభుత్వం దిగి రాకపోతే ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, వీరన్న, కిరణ్, సామేలు, రాజేష్ ఉన్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం

- వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి. జయలక్ష్మి


మహిళలకు న్యూట్రీషిన్ కిట్లను అందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి

మహానంది, మే 30 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకం లాభదాయకమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి అన్నారు. శుక్రవారం మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాల ఆవరణలో మండలంలోని బుక్కాపురం, పుట్టుపల్లి, తమ్మడపల్లి గ్రామాల్లోని ఎస్సీ మహిళలకు పోషకాహార, ఆర్థిక సాధికారత అనే పథకంలో భాగంగా పుట్టగొడుగుల పెంపకంలో చేపట్టవలసిన వివిధ ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఇప్పించారు. వ్యవసాయ రంగంలో మార్పు తెచ్చేందుకు ఐసీఏఆర్ సంస్థ ఎస్సీ సబ్‌ప్లాన్ క్రింద ఎస్సీ మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తుందన్నారు. అనంతరం 30 మంది మహిళలకు న్యూట్రిషనల్ కిట్ బ్యాగులను కళాశాల డీన్ చేతులమీదుగా అందచేశారు. కార్యక్రమంలో ఓఎస్ఏ డాక్టర్ ఎల్. విజయభాస్కర్‌తో పాటు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకుడు బుగ్గరాముడు

నంద్యాల రూరల్ మే 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కొన్నేళ్లుగా ఆర్థికసాయం అందిస్తున్నట్లు 38వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో 38 వ వార్డులో నివసిస్తున్న టీడీపీ కార్యకర్త షేక్ హిమాంహుస్సేన్, రహిమున్నిసా కుమార్తె వివాహానికి బుగ్గరాముడు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సూచనలు, సహకారం మేరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తాటికొండ మహేష్, బాబు, చిన్నరాముడు, మోజస్, హాజివలి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బండిఆత్మకూరు, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీనువాసులు(56) అనే వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. వివరాలు.. ఈనెల 24వ తేదీ శ్రీనివాసులు ఇంట్లో ఉరేసుకున్నాడు. వెంటనే నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోలుకోలేక మరో వ్యక్తి..

కొత్తపల్లి: మండలంలోని చిన్నగుమ్మడాపురం గ్రామానికి చెందిన రవీంద్రబాబు (46) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడు. ఆత్మకరు ఏఎస్ఐ వేణుగోపాల్ తెలిపిన వివరాలు.. ఈ నెల 27వ తేదీన కొత్తపల్లి మండలంలోని చిన్నగుమ్మడాపురం గ్రామానికి చెందిన రవీంద్రబాబుతో పాటు ఆయన చిన్నాన్న కుమారుడైన రాఘవేంద్రతో కలిసి ఆత్మకూరు మండలం కొట్టాలచెరువు సమీపంలో ఉన్న లింగమయ్యస్వామిని దర్శించుకునేందుకు బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొట్టాలచెరువు దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి కిందపడింది. దీంతో రవీంద్రబాబుకు తీవ్రగాయాలు కాగా వెనక కూర్చున్న రాఘవేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. రవీంద్రబాబును మెరుగైన వైద్యంకోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడని ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య కళావతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

బీడువారుతున్నాయ్..

- వేలానికి నోచుకోని మాన్యం భూములు
- సాగుకు ముందుకు రాని రైతులు
- ఆలయాలకు తగ్గుతున్న ఆదాయం
- కరువైన ధూప దీప నైవేద్యాలు


తలముడిపి గ్రామంలో పిచ్చిమొక్కలతో బీడువారిపోయిన ఎండోమెంట్ భూమి

మిడుతూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఆలయ భూములు వేలానికి నోచుకోక బీడువారుతున్నాయి. దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలయ భూములకు ఆదాయం తగ్గి పోయి ఆలయాల్లో వెలసిన దేవతా మూర్తుల ధూపదీప నైవేద్యాలు కరువైపోతున్నాయి. మండలంలోని తలముడిపి, బైరాపురం, వీపనగండ్ల గ్రామాల్లో ఉన్న ఆలయ భూములను ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించేవారు. ఈ ఏడాది మాత్రం మే నెల పూర్తి కావస్తున్నా భూములను వేలం పాటలు వేయ కుండా దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ భూముల్లో రైతులు సాగు చేయనందువల్ల అకాల వర్షాల కారణంగా పిచ్చి మొక్కలు, చెట్లతో నిండిపోయాయి. ఆలయ భూములను వేలం వేయనందున ఆలయాలకు ఆదాయం తగ్గే అవకాశం ఉంది. మండలంలోని తలముడిపి గ్రామంలో చెన్నకేశవ, ఆంజనేయ, జలేశ్వర మారెమ్మ దేవస్థానాలకు దాదాపు 90 ఎకరాలు, బైరాపురం గ్రామంలో చెన్నకేశవ, ఆంజనేయ, ఈశ్వర, వీరభద్ర స్వామి మాన్యం 70ఎకరాలు, వీపనగండ్ల గ్రామంలో చెన్నకేశవ, ఆంజనేయ స్వామి ఆలయాలకు 60 ఎకరాల మాన్యం భూములు కలవు. త్వరిత గతిన రైతులకు కౌలుకు ఇచ్చేందుకు ఆలయ భూములను వేలం పాటలు నిర్వహించాలని ఆయా గ్రామాల రైతులు కోరుకుంటున్నారు.

రెండుసార్లు అధికారులకు..

ఆలయ భూములను వేలం కోసం రెండు సార్లు అధికారులకు లేఖలు పెట్టాం. ఇంతవరకు జిల్లా దేవాదాయ శాఖ అధికారి నుంచి అనుమతులు అందలేదు. వారి అనుమతులు వచ్చిన వెంటనే ఆలయ భూములను వేలం నిర్వహిస్తాం

- వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ అధికారి

రైతులు ముందుకు రాక..



ఆలయ భూములకు వేలం నిర్వహించనందున మాన్యం భూములు బీడువారిపోతున్నాయి. ఆలయ భూములను సాగు చేసేందుకు రైతులు ముందుకు రాక ఆలయాలకు ఆదాయం తగ్గిపోతోంది. దేవాదాయ శాఖ అధికారులు స్పందించి వేలం నిర్వహించాలి.

- అంకిరెడ్డి, తలముడిపి గ్రామం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


రామచంద్ర మిషన్‌లో ధ్యానం చేస్తున్న ప్రజలు

నంద్యాల కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని శ్రీరామచంద్ర మిషన్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మనం అందరూ యోగాను ఒకపండుగలా జరుపుకోవాలని కోరారు. యోగా మాస్టర్స్ ఆశ, యోగా ధ్యానులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా యోగా..

పగిడ్యాల: క్రమ తప్పకుండా యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో సుమిత్రమ్మ తెలిపారు. స్థానిక ఇండోర్‌స్టేడియంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఒక్కరు క్రమం తప్పకుండా యోగ చేయడంతో మానసిక ప్రశాంతతతోపాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో ప్రజలు భాగస్వాములు..

కొత్తపల్లి : యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేద్దామని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీలు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బందికి యోగాంధ్ర శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యోగాను ప్రతిరోజు విధిగా పాటిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని అన్నారు. కార్యక్రమంలో డీటీ పెద్దన్నతో పాటు కార్యాలయ అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పగిడ్యాలలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది


కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో యోగాసనాలు చేస్తున్న అధికారులు

పూడికతీత సక్రమంగా చేపట్టలేదు

- పలువురు సభ్యుల ఆరోపణలు
- కౌన్సిల్ సమావేశంలో ఐదు తీర్మానాలు ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్

ఆత్మకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ వాగులో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టలేదని పలువురు సభ్యులు ఆరోపించారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఐదు తీర్మానాలను ఆమోదించారు. ఇందులో ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, నీటిసరఫరా, ఎలక్ట్రికల్ వర్క్‌లకు సంబంధించి క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికేట్లను ఇచ్చేందుకు గాను సీఈఎస్ ప్రైవేట్ కన్సల్టెన్సీని ఎంపిక చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి షేక్ షబ్బీర్‌అహ్మద్ అనే పాటదారుడు బస్టాండ్ వేలాలను రూ.15,01,000 దక్కించుకుని రూ.6లక్షల డిపాజిట్ చెల్లించారు. హైకోర్టు ఉత్తర్వులతో బస్టాండ్ ఫీజుల వసూళ్లు నిలిపివేయడంతో తనకు నష్టం వాటిల్లిందని తాను చెల్లించిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని అతడు విజ్ఞప్తితో పాటు గేట్ల పాటను రద్దు చేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లగా కౌన్సిల్ ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన అబీద్‌అలి కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయాన్ని అందించేలా తీర్మానించారు. ఎన్జీవీ పాలెం సమీపంలోని శ్మశానవాటికకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో రూ.1.93లక్షలతో బాగుచేసే పనులను ఆమోదించారు. పట్టణంలో ఏసీఎస్ గ్రాంట్ కింద జరిగిన ఏడు పనులతో పాటు గుండ్లకమ్మవాగులో చేపట్టి పూడికతీత పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు తీర్మానంపై సభ్యులు అభ్యంతరం తెలిపారు. కౌన్సిల్ బృందం పనులను నాణ్యత పరిశీలించాకే బిల్లుల చెల్లింపు అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. కమిషనర్ రమేష్ బాబు, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్, కౌన్సిలర్లు ఉన్నారు.

ఎండిన చెట్లతో ముప్పు




చెట్లు ప్రగతికి మెట్లు కాని ప్రాణాలకు ముప్పు కాకూడదు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే నంద్యాల - మహానంది రహదారిలో ఎండిపోయి కూలే పరిస్థితిలో ఉన్నా చెట్లు అధికారులకు కనిపించడం లేదు. అసలు వర్షాకాలం. భారీ గాలులు వీచే కాలం...ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు మహానందికి వెళ్లే రహదారిలో ఎండిపోయిన చెట్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రజలు ప్రమాదాల బారిన పడకముందే అధికారులు వాటిని తొలగిస్తారని ఆశిద్దాం..

- నంద్యాల ఎడ్యుకేషన్, ఆంధ్రజ్యోతి

ఆకట్టుకున్న బసవపురాణ హరికథా గానం



బసవ పురాణం హరకథ గానం చేస్తున్న ఉపేంద్ర భాగవతార్

నంద్యాల కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో శుక్రవారం మైదుకూరు ఉపేంద్రభాగవతార్‌చే బసవపురాణంపై హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. స్వామి అమ్మవార్లకు ప్రాచీనకళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. నిత్యకళారాధన హరికథ, బుర్రకథ, సంప్రదాయనృత్యం, వాయిద్య సంగీతం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కార వేదికలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- సమస్యలు పరిష్కరించేందుకు పరిష్కార వేదిక
- 90 శాతం వరకు సమస్యలు పరిష్కారం
- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లోని వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండ లంలో నాలుగో విడత సమస్యల పరిష్కార వేదిక నిర్వహించినట్లు, మూడు విడతల్లో 184 అర్జీలు రాగా దాదాపు 90 శాతం సమస్యలు పరిష్కరించామన్నారు. మిగతావి రెవెన్యూకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలు ఉన్నట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మండలంలోని గ్రామాల్లో 47 సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. వాణాల గ్రామంలో 18రోజుల నుంచి కొళాయిలకు తాగునీరు రావడం లేదని, ఇస్కాల గ్రామంలో సైతం తాగునీటి సమస్య ఉందని, పాములపాడులో నీటిట్యాంక్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. భవనాశి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని టీడీపీ నాయకుడు నాగలక్ష్మిరెడ్డి, పాములపాడు ఎస్సీకాలనీలో స్తంభాలు ఏర్పాటుచేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి అంకన్న ఎమ్మెల్యేను కోరారు. తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో, అధికారులు టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మహానందిలో భారీ వర్షం

- ఆలయ ప్రధాన వీధులన్నీ జలమయం
- చిన్నకోనేరులోకి వర్షపు నీరు
- ఇబ్బందులు పడ్డ భక్తులు


వర్షపు నీటితో మునిగిపోయిన చిన్న కోనేరు

మహానంది, మే 30 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఆలయ ప్రధాన వీధులన్నీ జలమయం అయ్యాయి. క్షేత్రానికి ఎగువన ఉన్న నల్లమల అడవి ప్రాంతంలో కురిసిన వర్షానికి నీరు సమీపంలోని ఆలయం వద్దకు చేరింది. దీంతో క్షేత్ర రెండో ప్రాకారంలోని చిన్న కోనేరులోకి వర్షపు నీరువచ్చి చేరడంతో పూర్తిగా మునిగింది. పుణ్యస్నానాలు చేయడానికి భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయం ముందు భాగంలోని ముఖద్వారం వద్ద కూడ వర్షపు నీటి ప్రవహించింది. మూడుగంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో ఒక్క మహానంది క్షేత్రంలోనే కాక మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో నీరు రోడ్ల పైకి ఎక్కి ప్రవహించింది. వర్షంతో అరటిపంటకు ఎంతో మేలు జరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ఎక్స్‌కవేటర్‌తో ధ్వజస్తంభాన్ని నిలబెడుతున్న దృశ్యం


ఆలయ ప్రాంగణంలో హోమాలు చేస్తున్న పురోహితులు

కొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో వివిధ దేవతామూర్తుల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈకార్యక్రమంలో వేద పండితులు విశ్వమూర్తి శర్మ, చక్రపాణిశర్మ, ప్రభాకర్ శర్మ, కాశీ విశ్వ నాథశర్మ, శశాంక్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం దేవతామూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మూలయంత్ర హోమాలు వేద మంత్రోచ్చరణాలతో భారీ భక్తజనం మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా ఉత్సవ విగ్రహాలను పుర వీధుల గుండా బాజాభజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహించారు. శివాలయ, దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని గుమ్మడాపురం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కార్మికులకు అండగా సీఐటీయూ


సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గానికి ఏ కష్టమొచ్చిన సీఐటీయూ అండగా ఉంటుందని ఆసంఘం పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే సీఐటీయూ ధ్యేయమని అన్నారు. 1970 మే 30న కలకత్తాలో కార్మికుల పక్షాన సీఐటీయూ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నాటి నుంచి నేటివరకు కార్మికులకోసం పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. నాయకులు రణధీర్, ఆనంద్‌బాబు, వీరన్న, రాజేష్, శ్రీను, బాషా ఉన్నారు.

అసంబద్ధంగా ఆర్య వైశ్య మహిళా సంఘం ఎన్నిక

ఆత్మకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్యవైశ్య మహిళా సంఘం ఎన్నికను అసంబద్ధంగా నిర్వహించారని ఆర్య వైశ్య సంఘం పట్టణ కార్యదర్శి గురుప్రసాద్ ఆరోపించారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 15 ఏళ్లుగా ఆత్మకూరు మహిళా సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న నరహరి విజయలక్ష్మి తన పదవికి రాజీనామా చేయడంతో నూతన కమిటీ ఎన్నిక అనివార్యమైందన్నారు. ఈ ఎన్నిక నిబంధనల ప్రకారం జరపాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండా జీవరత్నమ్మ అనే మహిళను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం పట్ల స్థానిక ఆర్యవైశ్య మహిళల మనోభావాలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. గతంలో కూడా పట్టణ కమిటీ ఎంపికలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేరును వాడుకుని ఎవరూ పోటీ చేయకుండా ఏకగ్రీవంగా కమిటీని ఎన్నిక చేశారని వివరించారు. అసంబద్ధంగా జరిగిన ఈ మహిళా కమిటీని రద్దు చేసి నిబంధనల ప్రకారం నూతన కమిటీ ఎన్నిక జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

దళితులకు ఉపాధి పనులు కల్పించండి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

ఉయ్యాలవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : దళితులకు వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలని నర్సిపల్లె గ్రామానికి చెందిన కాలనీ వాసులు మర్రి ఓబులేసు, రమణయ్య అధికారుల దృష్టికి తెచ్చారు. సివిల్ రైట్స్‌డే సందర్భంగా శుక్రవారం తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు కలిసి నర్సుపల్లె గ్రామ దళిత కాలనీలో దళితులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది దళితులకు వారం రోజులు మాత్రమే ఉపాధి పనులు కల్పించారని కాలనీవాసులు అధికారుల ముందు వాపోయారు. పనుల్లేక ఇళ్ల వద్ద ఉన్నామని, తమకు వంద రోజులు పనులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, వీఆర్వో దాదాసాహెబ్, కానిస్టేబులు నూర్ అహ్మద్ ఉన్నారు.

యాగంటి క్షేత్రంలో ప్రముఖుల పూజలు



యాగంటి ఆలయాన్ని దర్శించుకున్న ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేశ్

బనగానపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామిని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్‌కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. టీడీపీ వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, లాయర్ నాగేంద్రారెడ్డి, సాధుకొట్టం వెంకటేశ్, బండారు ప్రకాశ్, సుబ్రమణ్యం, హరి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. యాగంటికి చేరుకోగానే ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. డూండీ రాకేశ్ కుటుంబ సభ్యులు నందీశ్వరున్ని, యాగంటి ఉమామహేశ్వరున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

బనగానపల్లె, మే30(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఐ ఏపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, రైతు సంఘం జిల్లా సమితి సభ్యుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నందివర్గంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలో కన్వీనర్‌గా కొండారెడ్డి, కో కన్వీనర్‌గా బుజ్జిబాబు, సభ్యులుగా రంగస్వామి, పల్లె శివనాగిరెడ్డి, పాణ్యం శ్రీనివాసులు, లక్ష్మయ్య, షేక్షావలి, కమిటీ ఏర్పాటు చేశారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

కొలిమిగుండ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ ఉంచి పంచాయతీ కార్మికులకు అందించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి సూచించారు. శుక్రవారం పెట్నికోట గ్రామంలో కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నందున వీధుల్లో చెత్తను పడవేయరాదన్నారు. గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని ఆయన కోరారు.

దళితులపై దాడులను అరికట్టాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య

బేతంచెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై అగ్రకులస్థులు చేసే దాడులను ప్రభుత్వం అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు కార్యకర్తలు, దళితులపై జరిగే దాడులను అరికట్టాలని కోరుతూ నినాదాలు చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, దాసు, మద్దిలేటి స్వామి, శేఖర్, రాంబాబు, మధు, నాగమద్దయ్య, దళిత సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

బనగానపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై స్వామి విగ్రహం ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితుల సమక్షంలో నిర్వహించనున్నారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ బందోబస్తు మధ్య గ్రామోత్సవ వేడుకలు నిర్వహించారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

డోన్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రభుత్వ ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గ్రేస్ సెలస్టీయల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేవీఎస్ పార్కులో 80 మంది ప్రజలకు యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, యోగా గురూజీ రాంపుల్లయ్య, యోగా కమిటి సభ్యులు, వైద్యసిబ్బంది ఉన్నారు.

రుద్రవరం : యోగాతో ఆరోగ్యం పదిలమని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. గ్రామ కార్యదర్శులు ప్రజలకు చైతన్యం కల్పించాలన్నారు.

గ్రామాల్లో వర్షం

చాగలమర్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా శుక్రవారం కురుస్తున్న వర్షంతో రైతులు హర్షిస్తున్నారు. ఆరుతడి పంటల సాగుకు వీలు కలిగిందని, విత్తనాలు వేసుకునేందుకు సేద్యపు పనులు చేసేందుకు అవకాశం కలిగిందని చెబుతున్నారు. వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామంలోని పలు వీధుల్లో, మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పలు వీధులు నీటి కుంటగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

వక్కిలేరుకు జలకళ

ఆళ్లగడ్డ: మండలంలోని పలు గ్రామాల్లో కండపోతగా వర్షం కురుస్తోంది. పడకండ్ల గ్రామ సమీపం లోని ప్రధాన రహదారి పైనుంచి వర్షం నీరు ప్రవహిస్తోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా నీరు లేక ఎండిపోయిన వక్కిలేరు వర్షం నీరు చేరుతుండడంతో జలకళను సంతరించుకుంటుంది.

ఉయ్యాలవాడలో..

ఉయ్యాలవాడ: ఎనిమిదిరోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో 36.4 మి.మీ సాధారణ వర్షపాతం కాగా, ఇప్పటికే 147.2 మిమీ అధిక వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

ఇన్‌చార్జిలే దిక్కు

● సంక్షేమ హాస్టళ్లకు రెగ్యులర్ అధికారులు లేక ఇక్కట్లు
● పట్టించుకోని పాలకులు



డోన్‌లోని బీసీ బాలుర సంక్షేమ హాస్టల్

డోన్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలోని పలు కార్యాలయాలకు ఇన్‌చార్జిలే దిక్కు అయ్యారు. రెగ్యులర్ అధికారులు లేక అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా సంక్షేమ హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడం వల్ల విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ హాస్టళ్లపై ఎటువంటి శ్రద్ధ పాలకులు చూపలేదు. పట్టణంలోని కొండపేటలో ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్‌లో 200మంది విద్యార్థులు ఉన్నారు. కానీ, రెగ్యులర్ వార్డెన్ లేరు. ఎస్సీ హాస్టల్ వార్డెన్ మధు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అలాగే పట్టణంలోని బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌కు కూడా రెగ్యులర్ వార్డెన్ లేరు. దీంతో బీసీ కాలేజీ మేనేజ్‌మెంట్ హాస్టల్స్ వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. డోన్ ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్ రెగ్యులర్ వార్డెన్‌కు ప్యాపిలిలోని సంక్షేమ హాస్టల్‌క ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. రెగ్యులర్ వార్డెన్లు లేక సమస్యలు తలెత్తుతున్నాయి. రెండు వారాల్లో బడులు తిరిగి పునఃప్రారంభం కానున్నాయి. వీటితో పాటు సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులు హాస్టళ్లలో చేరుకుంటారు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వార్డెన్లను నియమించాలి



పట్టణంలోని సంక్షేమ హాస్టల్స్‌కు రెగ్యులర్ వార్డెన్లు నియమించాలి. రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతుంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ వార్డెన్లను నియమించాలి.

- తెలుగు విజయకుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, డోన్

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం

● రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరుతామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నందవరం గ్రామంలో పూర్తి అధ్వాన స్థితిలో ఉన్న డొంక రస్తాలో రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డితో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఒక్క సీసీ రోడ్డు అయినా నిర్మించారా అని బీసీ ప్రశ్నించారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఇప్పటికి రూ.60 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. బనగానపల్లె వేసవికాలంలో కూడా తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బనగానపల్లె మండల అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి. పీవీ.నాగార్జునరెడ్డి, ఎంపీడీవో రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణు గోపాల్, ఏఈ సాయికృష్ణ, పంచా యతీ రాజ్ ఏఈ రమణ, టీడీపీ నాయకులు వెంగన్న, సూర్యనారాయణరెడ్డి, గొల్ల వెంకటన్న పాల్గొన్నారు.

కల్యాణమండపానికి భూమి పూజ

మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయం ప్రాంగణంలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న కల్యాణ మండపానికి మంత్రి బీసీ జనార్ద న్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, నందవరం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, తెలుగుయువత నాయకుడు పీవీ. నాగార్జున రెడ్డి, ఆలయ కార్య నిర్వాహకాధికారి కామేశ్వరమ్మ, సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

చిత్తశుద్ధితో ప్రజాసమస్యలను అధికారులు పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దరఖాస్తులు మంత్రి స్వీకరించి సానుకూలంగా స్పందించడంతో అర్జీదారులు హర్షం వ్యక్తం చేశారు. అర్జీలు ఇవ్వడానికి వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, సామాన్యులు తరలివచ్చారు.

లబ్ధి కోసమే కార్యాలయం మార్పు

● మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

డోన్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ లబ్ధి, ఒకరిద్దరి స్వార్థం కోసం పట్టణానికి రెండు కిలోమీటర్లు దూరంగా ప్రజలకు అసౌకర్యంగా ఉండే చోటకు ప్రభుత్వ కార్యాలయాన్ని మార్చేందుకు సిద్ధపడుతున్న టీడీపీ పనులు దుర్మార్గమని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి బుగ్గన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యాలయాలు ఉంటాయనీ, టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకరిద్దరి భూముల లబ్ధి కోసం ఊరికి దూరంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును కూడా రూ.90 లక్షలతో నిర్మించడం జరిగిందన్నారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో డోన్‌ను మోడల్‌గా అభివృద్ధి చేసేందుకు ఎంతో శ్రమించానన్నారు. గతంలో డోన్‌లో పార్కులు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారనీ, వారిని దృష్టిలో ఉంచుకుని పార్కులు, స్విమ్మింగ్‌ఫూల్స్, ఇండోర్ స్టేడియం, విద్యాలయాలతో పాటు వందపడకల ఆసుపత్రి, మార్కెట్ యార్డు వంటి అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. రూ.కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్ ఫూల్స్‌ను ఉపయోగించకుండా కోర్టు సాకుతో మున్సిపల్ అధికారులు నిరుపయోగంగా ఉంచడం దారుణమన్నారు. శిలాఫలకాలపై పేర్లను తొలగించవచ్చు గానీ, ప్రజల గుండెల్లో బుగ్గన అభిమానాన్ని పూడ్చలేరని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ యాదవ్, నాయకులు శ్రీరాములు, మల్లెంపల్లె రామచంద్రుడు, సోమేష్ యాదవ్, పోస్టు ప్రసాద్, ఎర్రిస్వామి, ఆర్ఈ రాజావర్ధన్, టీఈ దినేష్‌గౌడు, జాకీర్ హుశేన్, హరి, బుగ్గన జయచంద్ర రెడ్డి, దొరపల్లె చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గనకు సన్మానం

డోన్ మండల నాయకులు మాజీ మంత్రి బుగ్గనను పుష్పగుచ్ఛం అందజేసి భారీ గజమాలతో, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కనపకుంట సర్పంచ్ కళ్యాణి, చిన్నమల్కాపురం నాగ గోపాల్ రెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి, చాపలకొత్తూరు మోహన్ రెడ్డి, పూజారి వంశీ, ఆర్టు రమణ, గడ్డం సురేష్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దేవాలయాల పరిరక్షణే ధ్యేయం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న
● ఘనంగా అహల్యాబాయి శతాబ్ది ఉత్సవాలు



అహల్యాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లింగన్న

కోవెలకుంట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవ, దేవాలయాల పరిరక్షణే ధ్యేయంగా రాజమాత అహల్యాబాయి పరిపాలన చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లింగన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాండురంగ విఠలేశ్వరస్వామి దేవాలయ ఆవరణంలో రాజమాత అహల్యాబాయి శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేద పాఠశాల విద్యార్థులు టీచర్లు, జిల్లా ప్రతినిధి ఎ.వెంకటసుబ్బయ్య, మైనార్టీ మండల అధ్యక్షులు లోకేశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ సుబ్బయ్య, మహిళలు పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని వైఎస్ నగర్ శివాలయం వద్ద రాణి అహల్యాబాయి జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అహల్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి, ఆలయ పూజారి హరిస్వామి, బీజేపీ నాయకులు బద్రి సుదాకర్, ఒంటెద్దు బండి కిరణ్, నందు రాజశేఖర్, శివప్రకాష్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, హరి, రామకృష్ణ పాల్గొన్నారు.

బేతంచెర్ల: హిందూ దేవాలయాల పునరుద్ధరించడమే అహల్యాబాయి లక్ష్యంగా పెట్టుకున్నారని బీజేపీ సీనియర్ నాయకులు నాగమోహన్ కొనియాడారు. శుక్రవారం సాయంత్రం బేతంచెర్ల బీజేపీ కార్యాలయంలో రాణి అహల్యబాయి జయంతి వేడుకలు జరిగాయి. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాయవాది నందిపల్లె నారాయణ, ధర్మప్రచారక్ బాలీశ్వరరెడ్డి, సముద్రాల మణికంఠ, సుధాకర్, పద్మనాభం పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు



బేతంచెర్లలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎల్లయ్య

బేతంచెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐటీయూ కార్యాలయం ఆవరణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణ అధ్యక్షుడు సంజీవ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, ధనుంజయ, నరసింహులు, తిరుమలేశ్, జలంధర్, చిన్న వ్యాపారస్థుల సంఘం నాయకులు వెంకటరమణ, టింగు, నాగరాజు, హమాలీ వర్కర్స్ పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని జలదుర్గం గ్రామంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రచ్చబండ దగ్గర సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ ముందుండి పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మద్దయ్య, దస్తగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ఆవరణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం, మండల కార్యదర్శి ఏవీ భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్, సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ప్యాపిలి మండల కార్యదర్శి ఎస్‌ఏ చిన్నరెహిమాన్ కలిసి ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం

కొలిమిగుండ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు మత పెద్దలు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సంఘ పెద్దలు, వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

డోన్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు ఉద్యమాలు ఆగవని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయం ఎదుట జూన్ 2వ తేదీ జరిగే ధర్నా వాల్ పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు డి.శ్రీనివాసులు, శ్రీనివాసులు, జి.హరినాథ్, జిలానీ బాషా పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయం మహోన్నతం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బుడ్డా శ్రీకాంతరెడ్డి

కొలిమిగుండ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను సూచించే హిందూ సంప్రదాయం మహోన్నతమైనదని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బుడ్డా శ్రీకాంతరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్.చెన్నంపల్లెలో జరుగుతున్న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో శ్రీకాంతరెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోనేటి వేణుయాదవ్, స్థానిక నాయకులు వెంకటరమణ, పాపయ్యనాయక్, సమరసత, విశ్వహిందూ పరిషత్, వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

కోవెలకుంట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణానికి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషను మంజూరైందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడీ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈ అనంతరావు, కన్‌స్ట్రక్షన డీఈ శ్రీనివాసులుతో కలిసి పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, జగనన్న కాలనీలో స్థలాన్ని పరిశీలించామన్నారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

ఆరు పాఠశాలలకు హెచ్‌ఎంల నియామకం

కొలిమిగుండ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు వెలువరించినట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం శుక్రవారం వెల్లడించారు. ఎర్రగుడి ఉన్నత పాఠశాలకు రాఘవయ్య, తిమ్మనాయినిపేటకు శ్రీవాణి, కొలిమిగుండ్లకు జయరామిరెడ్డి, బెలుంకు నాగేషయ్య, అంకిరెడ్డిపల్లెకు పాండురంగారెడ్డి, పెట్నికోటకు ధరణీదేవిని నియమించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ మండలానికి బదిలీ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

మోడల్ స్కూళ్లకు హెచ్‌ఎం పోస్టులు

ఉయ్యాలవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల నుంచి మోడల్ పాఠశాలలుగా ప్రమోట్ అయిన నాలుగు పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరైనట్లు ఎంఈవో -1 రఘురామిరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని ఇంజేడు, బోడెమ్మనూరు, హరివరం, ఉయ్యాలవాడ రెగ్యులర్ పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు మంజూరయ్యాయన్నారు. రాబోవు విద్యాసంవత్సరం నుంచి పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఉంటారన్నారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు

రుద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. మహిళలు అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించారు.

గుంతలు పూడ్చివేత

రుద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): చిన్నకంబలూరు మెట్ట రహదారిలో ఏర్పడిన గుంతలను శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో పూడ్చారు. గుంతల్లో నిల్వ ఉన్న నీటిని పక్కకు మళ్లించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారిని సిద్ధం చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

చాగలమర్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేసి అమ్మవారిని వెండి రథంలో కొలువు దీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి ప్రసాద్, ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామికి పూజలు

ఆళ్లగడ్డ, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకండ్ల గ్రామ సమీపంలోని శారదానగర్‌లో వెలసిన ఆంజనేయ స్వామి, గణపతి, శ్రీవల్లిదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి నవగ్రహ దేవతా కలశ స్థాపన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కాలనీవాసులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోట సంజీవరాయుడు, కంచర్లబాల గురువయ్య, కాలువ బాల నరసయ్య, నెట్ల పద్మనాభం, జయరామిరెడ్డి, నరసింహుడు, బాలనరసయ్య, లక్ష్మిరెడ్డి, రవి పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

చాగలమర్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టే విధంగా చట్టాన్ని తీసుకరావాలని టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చాగలమర్రి టీఆర్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కడపలో జరిగిన మహానాడులో నిరుద్యోగ సమస్యలపై చర్చించకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, కిట్లు విద్యార్థులందరికీ పంపిణీ చేయాలని, జీవో నంబర్ 77 రద్దు చేసి పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో టీఆర్ఎస్ఎఫ్ నాయకులు గోపి, కేశవ, నరసింహ పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

చాగలమర్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని మెటలారీజీ లీగల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ తూకాల మిషన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఈపాస్ మిషన్ ఆపరేటర్ సుందరం, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

ప్యాపిలి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగ మర్రి గ్రామంలో శుక్రవారం వేణుగోపాలస్వామి విగ్రహ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహానికి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు మోపూరి రామక్రిష్ణ, అరిగెల శంకర్, వెంకటరాముడు, రాము, భానుప్రసాద్, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య తదిరలు పాల్గొన్నారు.

2న రామాలయంలో ధ్వజశిఖర ప్రతిష్ఠ

చాగలమర్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె గ్రామంలో జూన్ 2న కోదండరామాలయంలో సీతారామలక్ష్మణ, హనుమాన్ విగ్రహాలు, ధ్వజశిఖరాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం నుంచి ఆలయంలో గోపూజ, గణపతిపూజ, కలశ స్థాపన, దీక్షాహోమం, 1న విగ్రహాల గ్రామోత్సవం, 2న సీతారామ కల్యాణం ఉంటుందన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.